


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి :7 నవంబరు, 2010 సంచిక : 6

(వికృతి నామ సం॥, కార్తీక మాసం)



**గౌరవ సంపాదకత్వం**

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

**ప్రధాన సంపాదకత్వం**

శ్రీ మాతా శుకవాణి
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

శ్రీ వి.వి. కృష్ణారావుగారు
(సాయిశ్రీ ప్రింటర్స్)

**ప్రచార సారథ్యం**

శ్రీ ఎం. సత్యనారాయణగారు M.Tech


**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం .......... | రూ॥ | 600/- |


**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 08685-326053**
**9440413455, 9848133565**


**విషయసూచిక** **పుటసంఖ్య**


మా వాణి ............ 2

దు:ఖమా, నీకు వందనం ............ 6

మన ఆచారాలు-శాస్త్రీయత ............ 8

సుసంఘటితంగా ............ 12

ఎవరిస్తారు? ............ 15

పుణ్యపాపనోపాఖ్యానము ............ 17

మనన యోగ్య శ్లోకాలు ............ 19

హనుమ హృదయం ............ 21

ద్వాదశ జ్యోతిర్లింగాలు ............ 23

ఆదిగురువు-దత్త ప్రభువు ............ 24

ఇది నా ఆత్మకథ ............ 27

ఓ చిన్న-కానీ-పెద్దముచ్చట ............ 30

మాతృసంస్థ కబుర్లు ............ 31

కర్తవ్యం-ఫలితం ............ 32








# మా వాణి





ప్రియ పాఠకలోకానికి శ్రీ సాయిరక్ష,

నవంబరు 5వ తేదీన దీపావళి పండుగ వస్తున్నది. దీపావళి అనగానే దీపం మన జీవితాలలో ఎంతగా పెనవేసుకుపోయిందో గుర్తు వస్తుంది. భారతీయుల సంస్కృతీ, సంప్రదాయాలలో దీపం ప్రాధాన్యం చాలా విస్తృతంగా ఉంది. అంతేకాదు-నిత్యజీవితంలో మనం 'దీపం' అనే దాన్ని ఎన్నోచోట్ల ఎన్నో రకాల వాడుతూ ఉంటాం. దీపం ఎంతగా మన భాషలో, భావనలో మమైక్యమై పోయిందో ఓసారి నెమరువేసుకొందాం.

ఓ శిశువు పుట్టగానే పురిటింటి గడప ప్రక్కన (బయటవైపు) దీపం పెట్టే సంప్రదాయం కొన్నిచోట్ల ఉంది. 'కొడుకు పుట్టాడు-కులదీపకుడు వచ్చాడన్నమాట' అంటారు. అలా మొదలు దీపంతో బంధం. వాళ్లమ్మ వాడిని ఎదకు హత్తుకొని "గోరంతదీపం-కొండంత వెలుగు, మా చిట్టితండ్రి నా కంటి వెలుగు" అని పాడుకొంటుంది. 'ఇంటికి దీపం యిల్లాలే' అన్న నానుడి మనం ఎప్పుడూ వినేదే. ఇప్పుడు ఆ యిల్లాలికి ఇంకో క్రొత్త దీపం దొరికిందన్నమాట. ఆ శిశువు ఆడపిల్లనుకోండి-కాస్త వయసు వచ్చి రూపు తేలగానే "అబ్బ! ఎంత చక్కని పిల్ల-చిదిమి దీపం పెట్టుకోవచ్చు" అంటాం. అన్నట్లు మన యిళ్లలో సంధ్య దీపం పెట్టే బాధ్యత కన్నెపిల్లలదే. గడపకు రెండువైపులా దీపపుగూళ్లని ఉండేవి. అప్పట్లో ఆముదం దీపాలు గదా! ఆముదం జిడ్డుగా ఉంటుంది. అంచేత దీపం పెట్టగా పెట్టగా గూళ్లు జిడ్డుమయమైపోయేవి. వాటిని వారానికోసారి శుభ్రంగా కడిగి, చుట్టూ నాము, పసుపు, కుంకుమ చుక్కలు పెట్టి అలంకరించే పని కన్యలదే. అందుకే పెళ్లిచూపులకు వచ్చిన వాళ్లు ముందు దీపపుగూడు

చూచేవాళ్లట!

'దీపంజ్యోతి పరబ్రహ్మ' అన్నారు విజ్ఞులు. ప్రతియింట్లోనూ తప్పకుండా ప్రతి పూటా దీపం పెట్టే సత్సాంప్రదాయం మనకున్నది. ఎందుకంటే దీపం సర్వతమో2హమ్-సమస్త విధాల అంధకారాలనూ నశింపజేయగలది. గృహిణులు రకరకాల వ్రతాలు, నోములు నోస్తూ ఉంటారు. ఆయా సందర్భాలలో దీపాలకెంతో ప్రాధాన్యం ఉన్నది. పోలాల అమావాస్యనాడు "పోలిని స్వర్గానికి పంపుతున్నాం-ఆమెకు దారి చూపడానికి ఈ దీపం" అంటూ అరటిదొన్నెలలో దీపంపెట్టి నదిలో వదులుతారు. దీపావళి వెళ్లగానే కార్తీకమాసం ప్రారంభమవుతుంది. ప్రతిరోజూ వేకువజామున నదీస్నానాలు చేసి దీపారాధన చేస్తారు. నెలనాళ్లూ కూడా సంధ్యాదీపాలు వెలిగిస్తారు. దీపావళినాడు ఎత్తైన కర్రపాతి దాని చివర గుమ్మటంలో దీపం వెలిగిస్తారు. దీన్ని ఆకాశదీపం అంటారు. పూర్ణిమనాడు ఉసిరికాయలు గిన్నెల్లా చేసి కొందరూ, అరటిదొన్నెల్లో కొందరూ దీపాలు వెలిగించి నదులలో వదులుతారు. కార్తీకదీపం మీద ఓ పాట వ్రాస్తూ శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఓ అందమైన భావాన్ని చెప్పారు-"ఆకాశాన ఆ మణిదీపాలేముత్తయిదువలుంచారో-ఈ దీపాలు చూచి వారు చుక్కలనుకొంటారో" అని. మకరజ్యోతి పేరిట అయ్యప్పభక్తులంతా దర్శించుకొనే శబరిమల దీపం గురించి అందరికీ తెలిసిందే.

అన్నట్లు ఇందాక కన్నపిల్లలే దీపాలు పెట్టేవారనుకొన్నాం గదా! ఇంగ్లీషు చదువు వెలగబెడుతున్న మనమరాలిని పిలిచి, "సంధ్య పడుతోందమ్మా! దీపంలో నూనె పోసి ముక్కు నలిపి వెలిగించు" అని చెప్పిందట నాయనమ్మ. కాస్సేపయ్యాక ఆ పిల్ల ఏడుపుముఖంతో వచ్చి "ఎంతసేపు ముక్కు నలిపినా దీపం వెలగటం లేదుగా" అన్నది. చూస్తే ముక్కంతా ఎర్రగా కందిపోయింది. కళ్లల్లో నీళ్లు దూకుతున్నాయి. అప్పడా నాయనమ్మ ఫక్కున నవ్వి, "పిచ్చిదానా, నలపమన్నది నీ ముక్కు కాదే-వత్తి ముక్కు" అన్నదట. చిన్నప్పడు మా అమ్మమ్మ చెప్పిందీ కథ.





నిత్యదీపం గాలిలో ఉన్న విషవాయువులను కాల్చేసి మనను రక్షిస్తూంటుంది. కనుక ఇది అఖండంగా వెలిగిస్తే మంచిది.

ఇంట్లో దీపం పెట్టటం అన్నది ఇల్లాలికీ, ఆడపిల్లలకే హక్కున్న పని. అందుకే పిల్లనడగటానికి వచ్చిన వాళ్లు 'మా యింట్లో దీపం పెట్టడానికి మీ పిల్లనివ్వండి' అని అడగటం ఆచారం. 'ఆడ దిక్కులేని యిల్లు' అనడానికి 'ఏం చేస్తామండీ! ఇంట్లో దీపం పెట్టే దిక్కులేదు' అంటారు. కాలగతిలో పల్లెటూళ్ల నుంచీ చిన్న చిన్న చేతిపనులవారు, వ్యవసాయకూలీలు భుక్తి కోసం నగరాలకు వలసపోతున్నారు. ఇప్పడిపుడు పిల్లలపై చదువులకోసమనో, క్రొత్తక్రొత్త వ్యాపారాల కోసమో కాస్తో కూస్తో ఉన్నవాళ్లు కూడా నగరాలకే ఎగబాకుతున్నారు. ఇవేవీకాక-ఉన్న ఒకళ్లిద్దరు పిల్లలు ఉద్యోగాలకో, వ్యాపారాలకో పట్టణాలకో, నగరాలకో పోతోంటే-"యిక యీ వయసులో యిక్కడుండి ఏం చేస్తాం!" అని ఊళ్లు విడిచి పెద్దలు కూడా వెళ్లిపోతున్నారు. ఎన్నడో పూర్వులు కట్టిన సున్నపు భవంతులూ, మండువాలోగిళ్లూ, అద్భుతమైన చెక్కనగిషీలతో దిట్టంగా వున్న మేడలూ అలా దీనంగా - దీపంపెట్టే దిక్కులేక, ఒకనాటి చైతన్యానికి శవరూపంలో నిలబడిపోయి ఉంటాయి. నరసంచారంలేని ఆ పాడుబడిన ఊళ్లని "బేచిరాగ్ గావ్" అంటారు. వెనుకబడిన ప్రాంతాలలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. ప్రయాణాలలో అలాంటివి కన్పించినపుడు గుండెలు కలచివేసినట్లవుతుంది.

అనారోగ్యంతో కళ్లు ఎర్రబడితే "కళ్లు జ్యోతుల్లా ఉంటాయి" మనకు. పిల్లలకు జబ్బు చేస్తే తల్లి కళ్లల్లో వత్తులేసుకొని ప్రక్కనే కూర్చొని కాపాడుకొంటుంది. ఎవరైనా యజమాని మరణిస్తే 'ఆ యింటి దీపం ఆరిపోయింది' అంటారు. అందుకే దీపం గాలికి ఆరిపోతే 'ఆరిపోయింది అనకూడదు-కొండెక్కింది అనాలి' అని చెప్తారు పెద్దలు. అన్నట్లు ఇంకో తమాషా సంగతి చెప్పారు మా గురువుగారు-'రాత్రిపూట ఉప్ప అనకూడదు, చవి అనో రుచి అనో అనాలంటారు ఎందుకు?" అని అడిగితే. చిన్నచిన్న నూనె దీపాల వెలుగులో వడ్డనలు

జరుగుతూ ఉండేవి ఆ రోజుల్లో. ఇంటిల్లిపాదీ ఒకేసారి భోజనానికి కూర్చునేవారు. అందులో పిల్లలు కూడా ఉంటారుగా! వాళ్లు 'ఉప్ప ఉప్ప' అని గట్టిగా అంటోంటే ఉఫ్ఉఫ్‌మన్నట్లయి దీపం పోయే అవకాశం ఉంటుంది. అందుకే అనవద్దని అంటారు. వేరే శాస్త్రీయకారణమేమీ కనబడ్డం లేదు మరి!" అని.

"లోకాల చీకట్లు బోకార్ప రవిచంద్రదీపాల గగనాన త్రిప్పిత్రిప్పి" అంటూ దేవుడు వెలిగించిన దీపాలే సూర్యచంద్రులన్నారు జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు. "లోలోన జ్ఞానదీపం వెలుగనీ మా కంచు-నీ మ్రోల దీపాలు నిలిపేము మేము" అన్నది సుమలత. 'అడుగడుగున గుడి ఉంది, అందరిలో గుడి ఉంది, ఆ గుడిలో దీపముంది, అదియే దైవం" అన్నారు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. ఇక మన పూర్వకవులు దీపం గురించి అన్నవన్నీ చెప్పాలంటే ఓ గ్రంథమే అవుతుంది.

మనకెవరైనా మహోపకారం చేస్తే 'దీపం బెట్టి దణ్ణం పెట్టుకోవాలి ఆ మహానుభావుడికి" అంటాం. అలా మన సమాజంలో గొప్ప సంస్కారదీపాలు వెలిగించిన పుణ్యపురుషులు రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు, కందుకూరి, గురజాడ, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రాజారామ్మోహనరాయ్ మొదలైన వారెందరో ఉన్నారు. యుగయుగాలుగా మనకు అనంతజ్ఞాన సంపద అందించిన మహర్షులున్నారు. వారందరికీ మనం దీపం పెట్టి దండం పెట్టుకోవద్దూ మరి! చీకటిని తిట్టుకొంటూ కూర్చోవటంకన్నా చిన్నదీపమైనా వెలిగించుకోవాలి. నేడు దేశం ఉన్న పరిస్థితులలో మనమే దీపాలం కావాలి. దీపావళినాడు వెలిగించే దీపతోరణాలలాగే మనం కూడా సేవాదీపాలం కావాలి. మనం సాయిభక్తులం. సేవలోనే తానున్నానని ఆయన అనేకసార్లు చెప్పారు. అంచేత మన తనువులు ప్రమిదలుగా మలుచుకొందాం. అనంతప్రేమను నూనెగా నింపుదాం. సేవానురక్తినే వత్తిగా నిలుపుకొందాం. నిశ్చయశక్తి అనే మంటతో యీ దివ్వెలను వెలిగించుకొందాం. లోకాలకు వెలుగునిద్దాం. అలాటి శక్తినిమ్మని సాయిని ప్రార్థిద్దాం. సెలవు.





# దు:ఖమా, నీకు వందనం

- సాధకమౌనానంద

దు:ఖం లేకపోతే మనిషి సత్యాన్వేషి కాలేడు. దైవం వైపు చూడలేడు. కృతజ్ఞతా భావంతో దు:ఖాన్ని పోగొట్టమని దైవాన్ని ప్రార్థించరాదు. నీ దు:ఖానికి నీ పూర్వకర్మలే కారణమని తెలుసుకోవాలి. సత్యం అర్థమయిన తరువాత దు:ఖం ఉండదు. మూలకారణం అర్థం కానంతవరకే దు:ఖం. అర్థమైతే దు:ఖం లేదు. అంతే.

బాహ్యకర్మ అజ్ఞానాన్ని నాశనం చేయలేదు. అనుభవం ద్వారా కలిగిన జ్ఞాన మొక్కటే అజ్ఞానాన్ని నాశనం చేయగలదు. ఆత్మవిచారం వల్ల మాత్రమే జ్ఞానం జన్మిస్తుంది. నేనెవరు? ఈ జగత్తంతటికీ మూలం ఎవరు? సృష్టి ప్రయోజనం ఏమిటి? ఇలా విచారణ సాగాలి. ఈ ప్రశ్నలకు బుద్ధి జవాబు చెప్పాలి. కానీ సామాన్యబుద్ధి చెప్పలేదు. అందుకే ఋషులు ఆధ్యాత్మిక విచారప్రక్రియగా యోగాన్ని రూపొందించారు. నీ అర్హతను బట్టి నీకు గురువు లభిస్తాడు. గురువుగా మనిషే ఉండాలన్న నియమం ఏమీ లేదు. ఒక చెట్టు, ఒక రాయి, ఒక జీవి, ఒక సంఘటన - ఏదైనా గురుస్థానాన్ని ఆక్రమించవచ్చు. అందుకే ఋగ్వేదం అన్నది 'మంచిభావాలు అన్ని దిక్కులనుండీ నన్ను చేరుగాక!" అని.

అల్పప్రాణి చీమనే తీసుకుందాం. సృష్టిలో మంచిని స్వీకరించి, చెడును వదిలెయ్యాలి. ఈ పాఠం చీమ ఎంత బాగా చెప్తుంది! పంచదార, ఇసుక కలిసి మిశ్రమం అయింది.చీమ చక్కగా పంచదార మాత్రమే తీసుకొని ఇసుక వదిలేస్తుంది. ఈ సృష్టిలో మంచీ, చెడూ రెండూ ఉంటాయి. అవి ఆచరించే మంచి వాళ్లు, చెడ్డవాళ్లూ యిద్దరూ ఉంటారు. నీవు మంచివారిని అనుక రించు. వారిలాగే మంచినే ఆచరించు. చెడును తిరస్కరించు - వది లెయ్యి. మరి చిన్న చీమకున్న వివేకమైనా మనకి ఉండాలి గదా! ఏ సంఘటన చూచి నా, ఎవ్వరిని కలిసినా మన సాధనకు పనికివచ్చే మంచేదైనా ఉందా- అని నిశితంగా పరిశీలించి గ్రహించాలి. గ్రహించినదాన్ని జీవితంలో ఆచరించాలి.

ప్రతి మనిషీ ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఓ చోట ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభించవలసిందే. తప్పదు. మొదటి అడుగే ముఖ్యం. ఆ తొలి అడుగు కాస్త భయపెడుతుంది. సంకోచం కలిగిస్తుంది. నీ అంతట నీకు సొంతంగా అడుగు పడటం లేదూ- గురువు సహాయం వేడుకో.

-: శుభమ్ :-

# మన ఆచారాలు-శాస్త్రీయత

ప్రియమైన శ్రోతలందరికీ శుభాకాంక్షలు. మన గ్రామాలలో అనాదికాలంగా వస్తున్న ఆచారాలను ఒకసారి గుర్తు చేసుకుందాం. వీటి వెనుక కేవలం మూఢత్వమే ఉన్నదో, శాస్త్రానికి సరిపోయే విలువలున్నాయో చూద్దాం.

మొట్టమొదట గ్రామీణులు నిద్రలేవగానే తమ యిష్టదైవాన్ని తలుచుకోవటమో, చేతిలో శ్రీరామ అని వ్రాసుకొని కళ్ల కద్దుకోవటమో, పచ్చని చెట్టును చూడటమో చేస్తారు. దీనివలన ఏం జరుగుతుంది? ఇదో భ్రమ- అని కొందరంటారు. ఏ మనిషికైనా తనకు కష్టసుఖాల్లో ఎవరో తోడు నిలవాలని ఆశ ఉంటుంది. అది బాగా శక్తి శాలి అయితే తనకు మేలు. అందుచేత తన నిత్యకార్యాలలో ప్రవేశించేముందు తన సంరక్షకుడికోసారి నమస్కారం చేస్తే తనను గుర్తుంచుకొంటాడాయన. దానివలన తన మనసుకు దన్ను లభిస్తుంది. అలాగే ఆకుపచ్చ రంగు కంటికీ, మనసుకూ కూడా ప్రశాంతతనూ, సంతోషాన్నీ కలిగిస్తుంది. ప్రొద్దున్నే లేచి ఎవడి ముఖం చూసానో!" అని ఏ చెడు జరిగినా ఎవర్నీ తిట్టుకునే పని కూడా ఉండదు. వాకిళ్లు ఊడ్చి, పేడ నీళ్లు చల్లి, ముగ్గులు పెట్టటం మనకు అలవాటు. పేడనీళ్ల వలన దుమ్ము పైకి లేవదు. అది క్రిమిసంహారిణిగా కూడా ఉపయోగపడుతుంది. అలా అలికిన ముంగిట్లో ముత్యాల ముగ్గులు పెట్టటం మన సంప్రదాయం. ఇంట్లో ఏదో అశౌచం (మైల) ఉంటే తప్ప ముగ్గు లేకుండా ముంగిలి ఉంచ కూడదు. ముగ్గు పిండితో వేస్తాం. ఆ పిండి చిన్ని చిన్ని క్రిమి కీటకాలకు ఆహారంగా ఉపయోగపడుతుంది. రంగవల్లులు తీర్చే యీ కళ స్త్రీల సొంతం. వారి కళాభిరుచికీ, రంగుల సమ్మేళనంలోనూ, అలంకరణలో ఉన్న నేర్పుకూ యీ ముగ్గులు అద్దం పడతాయి. ముగ్గుల మధ్య గొబ్బెమ్మలుంచి పూజించటం- అదో వేడుక.

గడపకు పసుపురాసి, గుమ్మానికి తోరణం కట్టిగానీ మన వాళ్లు శుభకార్యం మొదలుపెట్టరు. పసుపుకూ భారతీయ జీవనానికీ విడదీయరాని బంధం ఉన్నది. మన వంటల్లో పసుపు లేనిదే కుదరదు. ఇది కాన్సర్, ఆయాసం, క్షయ వంటి ఎన్నో వ్యాధులు రాకుండా అడ్డుకొంటుందని ప్రపంచం అంతా





ఒప్పుకున్నది. పచ్చి పసుపు ముఖానికీ, ఒంటికీ పూసుకొని మరీ స్నానం చేయటం మన ఆడపడచులకు అలవాటు. రోజంతా ఇళ్లు కడుగుతూ, అంట్లు తోముతూ, బట్టలుతుకుతూ - ఏదో ఒక రకంగా తడిలోనే గడుపుతుండే యీ దేశపు ఇల్లాళ్ల పాదాలకు ఎలాటి వ్యాధులూ రాకుండా, శైత్యం (జలుబు వంటివి) చెయ్యకుండా కాపాడుకోవడానికే ఆడవాళ్లు పాదాలకు పసుపు పూసుకోవటం. ఇన్ని లాభాలున్న పసుపు కనీసం పేరంటాలలో, పెళ్లిళ్లల్లో కూడా కాళ్లకు రాసుకోవటం మోటైపోయింది - మన నవనాగరిక యువతీమణులకు. ఎటొచ్చీ ఆ పసుపుతో తయారైన క్రీములు పూసుకోవటానికి మాత్రం ఏ మాత్రం అభ్యంతరం ఉండటం లేదు. అలాగే గడపకు కట్టే మామిడితోరణం కన్నులకు చలవనిచ్చి ఆనందాన్నిస్తుంది. అంతేకాదు. మామిడాకులు చెట్టునుండి కోసాక కొన్ని గంటల వరకూ (మూడు పుటల వరకూ కూడానని కొందరంటారు) సజీవంగా ఉంటాయని శాస్త్రం చెప్తుంది. పండుగలు, ఉత్సవాలకు ఇంటికి అనేకమంది బంధుమిత్రులు వస్తుంటారు. చాలామంది జనం చిన్న యింట్లో ఉన్నప్పుడు శ్వాసవ్యాధులకు కలిగే యిబ్బందులకు కూడా యింటిచుట్టూ కట్టిన మామిడి తోరణాల గాలి ఒక గొప్ప ఔషధంగా పనికి వస్తుంది.

ఇక మన ఆడపడుచుల ముఖాన దిద్దుకొనే కుంకుమ బొట్టుకు సాటి వచ్చే సౌందర్యసాధనం మరొకటి ఉందా? ప్రపంచంలో ఏ యితర జాతికీ లేని యీ భాగ్యం, యీ శాస్త్రీయజ్ఞానం మన జాతికి, మన ఋషుల పుణ్యాన లభించింది. మన కనుబొమలకు మధ్యగా కాస్త పైభాగంలో ఆజ్ఞాచక్రం ఉంటుంది. మన ఆలోచనలను, శరీరశక్తులను సంయమనం చేయగల - అంటే అదుపులో ఉంచే నాడీకేంద్రం ఈ ఆజ్ఞాచక్రమే. దీనిని చల్లగా ఉంచటం, అందరి దృష్టీ పడకుండా ఉంచుకోవటం చాలా అవసరం. బాణామతులు వగైరా దుష్టక్రియలు చేసేవారుగానీ, హిప్నాటిజం వంటివి చేసేవాళ్లు గానీ మన ఆజ్ఞాచక్రం మీదనే చూపు నిలుపుతారు. అందుచేత దీన్ని గంధంతోనో, కుంకుమతోనో, విభూతితోనో కప్పి ఉంచటం చాలా అవసరం. భారతీయులలో పురుషులు కూడా బొట్టు పెట్టుకోవటం సంప్రదాయం. అది ముఖానికి కళనూ ఇస్తుంది, మనకు మంచీ చేస్తుంది. ఇది శాస్త్రీయ విధానమే గదా! మన ఇళ్లలో చిన్నపిల్లలకు చేతలకు మురుగులు, కాళ్లకు కడియాలు పెట్టేవారు

పూర్వం. పిల్లలు పడినా మణికట్టు, చీలమండల దగ్గర ఎముకలకు దెబ్బలు పెద్దగా తగలకుండా అలా చేసేవారు. ముఖాన చాదు చుక్క-నూకలు వేయించి మెత్తగా రుబ్బిన పిండే చాదు. అది నుదుటికి అతికి ఉండి మేలు చెయ్యటమే కాక నలుపు దృష్టిదోషం పరిహరించేది. ఇది మూఢనమ్మకం అనే మనవారు టిక్కీబొట్లు జిగురుతో అంటించుకొని సాధించేదేమిటో వాళ్లకే తెలియాలి. పైగా ఆ బొట్టు కూడా చాలా సిగ్గుపడుతున్నట్లుగా దోమ రెక్కంతో, దాని మీది చుక్కంతో పెట్టుకొంటున్నారు.

ఇంట్లో నిత్యదీపం పెట్టటం, వారానికి కనీసం రెండు మూడుసార్లు ఇల్లంతా సాంబ్రాణి పొగవేయటం మనకు అలవాటు. ఇవి ఉత్తుత్తి ఆచారాలు కానేకావు. సాంబ్రాణి పొగ వేయటం వలన మూలమూలల్లో దాక్కొని గూళ్లు అల్లుకొనే సాలె పురుగులు, దోమలు, ఈగలు మొదలైన కీటకాలన్నీ పారిపోతాయి. బూజు పట్టటం తగ్గిపోతుంది. ఇది సైన్సు. కీడు కూడా పోతుందన్నది ఒక నమ్మకం. ఇక దీపం. మన చుట్టూ ఉన్న గాలిలో మిథేన్ అని ఒకరకపు విషపుగాలి కలిసి ఉంటుంది. దీనిని కాల్చేయడానికి దీపం పెడతాం. మనకు నైరుతి ఋతుపవనాలు ఎక్కువ. ఆ గాలి ఈశాన్యంవైపు దూసుకువెళ్లే అవకాశాలెక్కువ. అందుకే మన పెద్దలు ఈశాన్యం మూలదీపం పెట్టమని చెప్పారు. ఈశాన్యం మూలనే దేవుడి పూజామంటపం కూడా పెట్టమన్నారు. 'ఇది యింటికి మంచిదర్రా' అంటే సరిగ్గా వినం గనుక 'దేవుడి ముందర దీపం పెట్టాలి. లేకపోతే పాపం' అని భయపెట్టే తీరున చెప్పారు. నయాన చెప్తే వినకపోతే భయాన్నైనా చెప్పాలిగా మరి! భోపాల్ అనేచోట ఓ పెద్ద కంపెనీలో విష వాయువులు లీకయ్యాయి, అంటే బయటకు వచ్చేసాయనుకోండి. భయంకరమైన మంటలు చెలరేగాయి. ఆ విషయవాయువుల ప్రభావానికి ఆ పరిసరాల్లో కొన్ని వందల మందికి కళ్లు పోయాయి. ఎందరో చనిపోయారు. తల్లి కడుపులో ఉన్న బిడ్డలకు కూడా ఎన్నో అవకరాలు వచ్చాయి. నానా భీభత్సంగా జనం అనారోగ్యాల పాలయ్యారు. కానీ, ఆ ఊళ్లో నిత్యం యింట్లో హోమగుండం వెలిగించి ఉంచే మూడు, నాలుగు యిళ్లలోని వారికి మాత్రం ఎటువంటి అనారోగ్యం కలగలేదు. కారణం యిదే - వస్తున్న విషపు గాలిని వస్తున్నట్లుగా కాల్చి పారేసింది హోమాగ్ని. అందుచేత మనం నిత్యం దీపాన్ని వెలిగించి





ఉంచుదాం. వచ్చే కీడును కాల్చి పారేద్దాం. రోగాల బారిన పడకుండా కాపాడే దీపలక్ష్మికి "దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వతమోపహం దీపేన సాధ్యతే సర్వం, దీపలక్ష్మీ నమోస్తుతే" అని నమస్కరిస్తాం. అది సర్వతమస్సులనీ - అంటే అన్ని రకాల చీకట్లనీ, దు:ఖాలనీ కూడా పోగొడుతుంది. డాక్టరు ఖర్చులూ తగ్గిస్తుందిగా!

"మాకు సమయం చాలదు. తెల్లవారి లేస్తే రెక్కలు ముక్కలు చేసుకునే వాళ్లం. ఇవన్నీ మాకెలా కుదురుతాయి?" అంటారా? ఎలాగూ ఇళ్లూడుస్తారు గదా! మీ ఇంట్లోని పిల్లలు బడికి వెళ్లడానికి స్నానం చేస్తారుగా! వాళ్ల చేత పెట్టించండి చిన్న దీపం. ఆదేం భాగ్యమా, బంగారమా! ఇంకో సంగతి గుర్తు చేయనా? కావాలంటే మీ అమ్మమ్మలూ, నాయనమ్మలూ ఉంటే అడిగి చూడండి-పూర్వం కరెంటు దీపాలు రాకముందు-వీధులన్నీ చీకటి చీకటిగా ఉండేవి. అందుచేత సందెదీపం బయట బాటసారులకీ, యింట్లోకీ కూడా పనికివచ్చేట్లు గడప మీద పెట్టేవారు. పెట్టి ఊరుకునే వాళ్లమా - "ఇరుగు చల్లన, పొరుగు చల్లన-పాడి చల్లన, పంట చల్లన-బిడ్డ చల్లన, పాప చల్లన - తల్లీ దీపలక్ష్మీ దేశం చల్లన, ధర్మం చల్లన" అని దండం పెట్టుకొనేవాళ్లం. ఎంత చక్కని, గుండె చల్లబరిచే సంప్రదాయాలయ్యా మనవి! ఎందుకు మర్చిపోతున్నాం తల్లీ! ఆలోచించండి.

ఆ మధ్యన మా మిత్రులొకరు చెప్పారు - వాళ్లమ్మగారు కరెంటు లైటు వేసి 'ఇది దీపం కాదేమిటి!" అంటుందని. మరి, అది విషవాయువులను కాల్చగలదా, కంటికి చలవ యివ్వగలదా! అంచేత దీపం దీపమే - నిత్యం వెలిగిద్దాం.

పెరట్లో ఒక తులసి మొక్కను పెంచి, నిత్యం పూజ, ప్రదక్షిణం చెయ్యాలని మన పెద్దలు చెప్పేవారు. ఈనాటికీ ఏ పదో అంతస్థులోనో ఉండి కూడా చిన్న కుండీల్లో తులసిని పెంచుకొనే కుటుంబాలున్నాయి. ఎటొచ్చీ గ్రామీణులమే మర్చిపోతున్నామేమో! "ఏ కరివేపాకు మొక్కో వేసుకోక యీ తులసి దేనికీ!" అని ముక్కూ మూతీ విరిచే నవనాగరికులూ లేకపోలేదు. తులసి అనేక వ్యాధులను తగ్గిస్తుంది. తులసి మీది నుండీ వచ్చే గాలి దమ్ము, ఆయాసం ఉండే రోగులకు ఎంతో మంచిది. చిన్నపిల్లలకు వచ్చే జలుబులకు, దగ్గులకు తులసిరసం, తేనె రంగరించి నాకించటం అద్భుతమైన మందు. ఒంటి దురద

మొదలు గుండె జబ్బుల వరకు తులసి ఔషధంగా పనిచెయ్యని వ్యాధి లేదు. అందుచేత తులసిని పెంచమన్నారు. ఆడవాళ్లు ఇల్లు దాటి బయటకు వెళ్లేది చాలా తక్కువగా ఉండేది పాతకాలంలో. అందుకని తులసికి ప్రదక్షిణలు చేస్తే గొప్పవాకింగేగా! తులసి గాలి వంధ్యాత్వాన్ని - అంటే పిల్లలు పుట్టని గొడ్రాలి తనాన్ని కూడా పోగొట్టగలదంటారు వైద్యులు. అంచేత తులసిని పెంచటం శాస్త్రీయమే.

ఇతర దేశాలలో వైద్యవిధానాలు, పరిశోధనలు మహా అయితే ఓ వెయ్యేళ్ల క్రితం మొదలైనాయి. మన దేశంలో ఎన్నో వేల ఏళ్ల క్రితమే ఉన్నాయి. మొన్నమొన్న మన వాళ్లు టెస్టుట్యూబ్ పిల్లలను ఉత్పత్తి చేస్తే - ఎన్నడో మహాభారతకాలంలోనే గాంధారి గర్భంలోని పిండాన్ని నూరు ముక్కలు చేసి, నేతికుండల్లో భద్రపరచి కౌరవులందరినీ పెంచాడు వ్యాసుడు. తలవెంట్రుకను నిలువుగా పన్నెండు చీలికలు చేయగలంత పదునైన ఆయుధాలతో ఆపరేషన్లు చేసారు మన పూర్వులు. ఏ పదార్థంలో, ఏ పండులో, ఏ ఆకులో ఏఏ శక్తులున్నాయో కనిపెట్టి గ్రంథాలు వ్రాసారు. తల్లి కడుపులో పిండం ఏ నెలలో ఎలా ఉంటుందో, ఏ నెలలో ఏ శక్తులు వస్తాయో, ఎప్పడు జుట్టు వస్తుందో, ఎప్పటినుంచీ వినికిడి, ఆలోచన మొదలవుతాయో అద్భుతంగా ఊహించగలిగారు - ఎలాటి యంత్రాలు, పరికరాలు లేని రోజుల్లోనే. ఆకాశంలో ఎగిరే పక్షులను గురించీ నేలమీది జంతువుల గురించే కాదు-కంటికి కనిపించని గ్రహగతులను కూడా వాళ్లు దివ్యదృష్టితో చూడగలిగారు. చివరికి మన చిన్న పిల్లలు ఆడుకొనే “కాళ్ల గజ్జె కంకాళమ్మా వంటి పాటల్లో కూడా సైన్సు, వైద్యం ఉన్నాయి. మొత్తం మీద-

మన ఆచారాలన్నీ సైన్స్ మీద ఆధారపడి, పరిశోధించి మరీ మన పెద్దలు ఏర్పరచినవే. మరి యిప్పడెలా ఉన్నాం?

అమెరికా వాడు చెప్తే గానీ మనకు పసుపు విలువ తెలియటం లేదు. ఇంకే దేశంవాడో అంటేగానీ మనకు పీట మీద కూర్చొని వంగి తినటం వలన జీర్ణశక్తి పెరుగుతుందని తెలియదు. ఇంకెవడో వచ్చి కూస్తే గానీ - “తలకు రాసుకొనే కొబ్బరినూనె మన మెదడును చల్లబరుస్తుంది. సూర్యుడి అల్ట్రా వయొలెట్ కిరణాల నుంచీ మనను రక్షించేది అదే. అందుకే యితర దేశాలలో ఉన్నన్ని పిచ్చి ఆసుపత్రులు మన దేశంలో లేవు” అని మనకు తెలియదు. అయ్యో, యిదీ మన దౌర్భాగ్యం! ఇకనైనా మేలుకుందాం. మన మంచి సంప్రదాయాలు మనం రక్షించుకుందాం.





# సుసంఘటితంగా

-'మన జాతీయ నాయకులు' నుండి

సుభాస్ చంద్రబోస్ ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ. డిగ్రీ ఆనర్స్‌లో చేరాడు. అతని ఆలోచనలకు, అభిరుచులకు అనుకూలంగా తత్త్వశాస్త్రం చదవాలని నిర్ణయించుకున్నాడు బోసు. ప్రెసిడెన్సీ కళాశాలలో ఓటక్ అని ఒక ఆంగ్లేయ అధ్యాపకుడు ఉండేవాడు. అతడు కూబి! వికలమయిన మనస్తత్వం కలవాడు. తన విద్యార్థులు మంచిమార్కులు తెచ్చుకుంటే అతడు సహించలేకపోయేవాడు. విచిత్రప్రాణి, ఉపాధ్యాయ పదవికి అతనికి సరయిన అర్థం తెలియదు. తన దగ్గర వినయంగా ఉండే విద్యార్థులయినా సరే మంచి అభ్యుదయం సాధిస్తే చూడలేకపోయేవాడు. యువకులందరికీ అతని జాడ్యం మీద అసహ్యం ఏర్పడింది.

విద్యాబోధన సమయంలో కూడా నలుపు, తెలుపు అని వర్ణ వివక్ష చూపించేవాడు. అది విద్యార్థులను గాయపరచింది. విద్యార్థులలో కొందరు విప్లవ పంథాదారులుండేవారు. ఈ వికట ఉపాధ్యాయుని భరతం పట్టాలని వారు చక్కగా పథకం రూపొందించారు కళాశాలలో ఒక సందర్భంగా చీకటి మాటున అతనికి బాగా దేహశుద్ధి గావించారు. అప్పడు జరుగుతున్న కార్యక్రమం ప్రకారం విద్యార్థులందరూ అక్కడే ఉన్నారు. వారందరితోపాటు బోసుబాబు కూడ ఉన్నాడు. ఉపాధ్యాయుడు వెళ్లి కులపతికి చెప్పకున్నాడు. మరునాడు ఆయన విద్యార్థులందరినీ పిలిపించి విచారణ ప్రారంభించారు. బోసుబాబు ఉపాధ్యాయుని మీద చేయి ఆడించలేదు. వాస్తవానికి అతనికి దేహశుద్ధి జరిపించిన వారిలో అతడు లేడు. అయినా అతడు కళాశాల నుంచి బహిష్కృతుడు అయినాడు. మరే ఇతర కళాశాలలో చదవరాదని విశ్వవిద్యాలయం షరతు. బోసుబాబు రైలులో కటక్ బయలుదేరాడు. మనసు వికలంగా అయిపోయింది. చేయని తప్పకు శిక్ష! చదువుకి విఘాతం బాగా కృంగదీశాయి. అయితే అతడు తిరుగుప్రయాణం చేస్తూ రైలులో బాగా ఆలోచించాడు. ఆత్మవిమర్శ చేసుకున్నాడు. ఎట్టి పరిస్థితులలోనూ తాను బాధపడవలసిన అవసరం లేదని నిర్ణయించుకున్నాడు. తప్ప చేయలేదు. కనుక

బాధపడలేదు. మనసుకి అయితే తృప్తిగానే ఉన్నది. కటక్‌లో రైలు ఆగింది. అన్నలు, మిత్రులు పూలదండలతో ఎదురు వచ్చి స్వాగతం చెప్పారు. ఒక వీరుని గౌరవించిన విధంగా అతనిని గౌరవించారు.

"విచారణకు వేసిన కమిటీ వారు ఇచ్చిన నివేదికలో నీవు తప్పు చేయలేదని తేల్చారు. బ్రిటిష్ వారి దురన్యాయాలకు తలవంచక బహిష్కారాన్ని పొందటమే గౌరవం" అని వారు అతనితో చెప్పారు. ఇంటికి వస్తే తప్పు చేసి తిరిగి వచ్చినట్లుగా చూడలేదు ప్రభావతీదేవి. వీరపుత్రునిగా ఆదరించిందామె. తండ్రి కూడ చదువు డుమ్మా కొట్టినందుకు ఏమీ అనలేదు. ఒక సంవత్సరకాలం అతడు కటక్‌లో ఉన్నాడు. ఆంగ్లేయుల దౌష్ట్యాన్ని ఎదిరిస్తే ఎంత వీరపూజ లభిస్తుందో ఆ కాలంలోనే అతనికి అర్థమయింది. అందుకు ఉద్యమించాడు. ట్రాము బళ్ళలో, రోడ్ల మీద భారతీయులు ఆంగ్లేయుల వలన అవమానాలకు గురి అవుతున్నారు. ట్రాము బళ్ళ ప్రయాణంలో తెల్లవారు తమ ఆధిపత్యాన్ని అడుగుఅడుగున చాటుకుంటున్నారు. భారతీయులు వారి కాళ్ళ దగ్గర కూర్చోవలసి వచ్చేది. ఆంగ్లేయులు ప్రతి ఒక్కరూ మేము ప్రభువులం అన్నట్లుగా ప్రవర్తించుతున్నారు. పాలితులు గనుక భారతీయులు అవమానాలు భరించాలి. ఎదురు తిరిగిన వారిని అవమానకరంగా శిక్షిస్తున్నారు.

ఒకసారి కటక్‌లో సుభాష్‌చంద్రబోసు ట్రాములో ప్రయాణం చేస్తున్నాడు. బండితోలే వాని పాదాలను తాకుతూ ఒక గోనెసంచి ఉన్నది. దాని మీద ఒక అధికారి నౌకరు కూర్చుని ఉన్నారు. కొంతప్రయాణం సాగించిన తరువాత భారతీయ ప్రయాణికుడు ఒకరు బండి మీద ఎక్కాల్సి వచ్చింది. ట్రాము బండిలో తెల్లవారి మధ్య అతడు కూర్చోవాలని ప్రయత్నించాడు. అందుకు వారు అభ్యంతరం చెప్పారు. బండితోలే వాని కాళ్ళ దగ్గర కూర్చున్న నౌకరునులోనికి రమ్మని పిలిచారు. ఆస్థానంలో భారతీయుణ్ణి కూర్చోమన్నారు. ఎదురు తిరిగేందుకు శక్తి చాలని ప్రయాణీకుడు అవమానాన్ని భరిస్తూ అక్కడే కూర్చున్నాడు. బండి తోలేవాడి కాళ్లు అతనికి తగిలాయి. అభ్యంతరం చెప్పడంతో కీచులాట ప్రారంభ మయింది. అధికారి తలబిరుసుగా మాట్లాడాడు. "పాలించే వారము మేము. అధికారం మాది" అన్నాడు. "మేము చేసే పనులకు మీరు తలవంచి తీరవలసిందే!" అన్నాడు దండింపుగా "ఎక్కడ కూర్చోవటమనేది





సమస్య కాదు. ప్రయాణం చేయాలనుకున్నప్పుడు సర్దుకుపోవటంలో తప్పు లేదు కావాలని కాలు తగిలించినా భరించాలా?" అన్నాడు ప్రయాణీకుడు. అందుకు తెల్లవారు పరిహాసప్రాయంగా నవ్వారు.

"కాళ్ళు కావాలని తగిలించినందుకు క్షమాపణ చెప్పాల్సిందే" అని ప్రయాణీకుని తరఫున వకాల్తాగా మాట్లాడాడు బోసు. ఇది చిలికి చిలికి గాలివాన అయింది. బానిసలకు అహంకారం పనికిరాదని చెప్పటానికి ప్రయత్నించాడు తెల్లదొర. బానిసలంతా ఎదురుతిరిగితే ప్రభువులు తలక్రిందులు అవుతారని హెచ్చరించాడు బోసు. ఎవరూ తగ్గలేదు. వివాదం పెరిగింది. పెట్రేగిపోయారు. వాస్తవానికి ట్రాములో ప్రయాణిస్తున్న వారిలో అధిక సంఖ్యాకులు భారతీయులే! తెల్లవారు కొద్దిమందే అయినా వారే జులుం సాగిస్తున్నారు. భారతీయులు భయంతో ఎవరికి వారే తంటాలు పడుతుంటారు. అనైక మత్యము వారి దాష్టీకం సాగటానికి కారణం. బోసుబాబు ఈ పరిస్థితిని ఎదరించటంతో వారికి క్రొత్త ఊతం వచ్చినట్లయింది. ట్రాములో ఉన్న భారతీయులందరూ ఒకేమాట మాట్లాడటంతో తెల్లవారు ఇరుకున పడిపోయారు. ట్రాము బండి నిలిపివేశారు.

దారిన వెళ్లేవారు కూడా వారిచుట్టూ చేరారు. భారతీయుల సంఖ్యాబలం బాగా పెరిగిపోయింది. దాంతో పరిస్థితిని గమనించిన తెల్లవారు తోకముడిచి పారిపోవాలని ప్రయత్నించారు. కాలు తగిలినందుకు క్షమాపణ చెప్పి వెళ్ళమని రెట్టించాడు బోసు. సంఖ్యాబలం పెరిగిపోవటంతో మిగిలినవారు చుట్టు ముట్టారు. తెల్లవానికి తప్పనిసరి పరిస్థితి అయింది. వాడు భారతీయునికి క్షమాపణ చెప్పాడు.

ఈ సంఘటన తరువాత బోసుబాబుకి ఒక విషయం స్పష్టంగా అర్థ మయింది. భయపడటం, అవమానాలు భరించి తలవంచటమే భారతీయుల వంతుకాదు. వారు సంఖ్యాబలంలో అధికులు. వారి సొమ్ము తిని వారి మీదే పెత్తనం చేస్తున్న తెల్లవారు అల్పసంఖ్యాకులు. ఆయుధాలు, అధికారి చూపి వారు భారతీయుల్ని బెదిరిస్తున్నారు. దాష్టీకాలు జులం సాగిస్తున్నారు.

అజ్ఞానం వల్ల, దరిద్రం వల్ల, అనైకమత్యం వల్ల పరిస్థితిని అర్థం చేసుకోలేక పోవటం వల్ల భారతీయులు తలలు వంచుతున్నారు. బాధితులు, దీనులు అందరూ ఏకమై సుసంఘటితంగా నిలిస్తే బ్రిటిషు వారు తోకముడిచి పారిపోక తప్పదు. ★

# ఎవరిస్తారు?

ఓసారి మాటల్లో ఏదో చర్చ వచ్చింది-అక్బర్ సంస్థానంలో. భగవంతుని కృప గొప్పదా - మానవకృషి గొప్పదా- అని. ప్రభువువారు మానవకృషే గొప్పదని భావించగా-దైవబలమే గొప్పదని బీర్బల్ వాదించాడు. వాదన పూర్తిగా తెగలేదు. "సరే- ప్రస్తుతానికి ఈ వాదన ఆపివేద్దాం. కొద్దిరోజులలో నీకే సత్యం ఋజువవుతుంది" అన్నాడు అక్బరు. సరేనన్నారు బీర్బల్, సభ్యులు కూడా. కొన్ని రోజులు గడిచిపోయాయి.

అక్బరు, బీర్బల్ కలిసి మారువేషాలలో రాజ్యపరిస్థితులు తెలుసుకోవాలని బయలుదేరారు. గ్రామాలన్నీ తిరుగుతూ తిరుగుతూండగా బాగా ప్రొద్దుపోయింది. అప్పటికి ఒక గ్రామం చివర ఉన్న అడవిలోకి చేరుకున్నారు. దాటి అవతలికి వెళ్లి మరోగ్రామం చేరుకొనే ఓపిక లేదు. ఓ చెట్టు క్రింద కూలబడ్డారు. చచ్చే ఆకలి. బీర్బల్ అసలు పేరు వీరబలుడు. ఆయన హిందువు, రామభక్తుడు. దైవం పట్ల గాఢమైన విశ్వాసం ఉందతనికి. అంచేత పద్మాసనం వేసుకొని 'శ్రీరామ జయరామ జయజయరామ' అంటూ నామజపం ప్రారంభించాడు. అక్బర్ విసుక్కున్నాడు. "ఏమయ్యా, రామ రామంటూ కూర్చుంటే కడుపు నిండుతుందటయ్యా! నడువు-ఎలాగోలాగ ఊళ్లోకి వెళ్లి తిండి సంపాదించుకొందాం" అన్నాడు. బీర్బల్ చేతులు జోడించి, "మహాప్రభూ, నాకు ఆకలిగా ఉన్నదని నా స్వామికి తెలుసు. నా ప్రార్థన తప్పకుండా వింటాడు-నాకు భోజనం ఆయనే పంపిస్తాడు. ఆ నమ్మకం నాకున్నది" - అంటూనే కళ్లు మూసుకొని మళ్లీ నామజపం ప్రారంభించాడు. అక్బరు కొంచెం కోపంగా నడుచుకొంటూ గ్రామంవైపు వెళ్లిపోయాడు. బీర్బల్ అలాగే ధ్యానంలో మునిగిపోయాడు.

అక్బరు పల్లెలోకి వెళ్లి ఓ యింటి ముందు నిలబడ్డాడు. గడపలోకి వచ్చి 'ఆకలి' అన్న ఎవ్వరినీ ఉత్తి చేతులతో పంపటం మన సంప్రదాయం కాదు. ఆ చిన్న పల్లెటూర్లో జనం భోజనాలైపోయి నిద్రపోబోతున్నారు. అయినాగానీ అతిథి రాగానే ఆ గ్రామంలోని ఆ యింటివారు ఆదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టారు.





అప్పటికప్పుడు నాలుగు రొట్టెలు చేసి, ఉన్న పచ్చడీ, పెరుగూ తెచ్చి ముందుపెట్టారు. తానెవరో తెలియకపోయినా అంతగా ఆదరిస్తున్న తన ప్రజను అతిథిమర్యాదను మనసులోనే మెచ్చుకున్నాడు అక్బరు. ఆప్యాయంగా తిన్నాడు. అంతలో ఆ యింటి యిల్లాలు మరో నాలుగు రొట్టెలు తెచ్చి వడ్డించబోయింది. అక్బరు ఆమెను ఆపి, "అమ్మా, నాతోపాటు మరొక మిత్రుడు కూడా ఉన్నాడు. ఈ రొట్టెలు అతనికి తీసుకువెడతాను" అన్నాడు. ఆమె సంతోషంగా అవి ఆకులో కట్టి అక్బరు చేతికిచ్చింది. అది తీసుకొని అడవిలోకి వచ్చాడతడు.

ఇంకా బీర్బల్ ధ్యానంలోనే ఉన్నాడు. అక్బర్ పిలవగా కళ్లు తెరిచి చూచాడు. అక్బరు అందించిన రొట్టెల పొట్లం విప్పి ఆనందంగా తిన్నాడు. అతడు నీళ్లు త్రాగి ప్రశాంతంగా కూర్చున్నాక, అక్బరు అతనితో "చూచావా, నా మానవ ప్రయత్నం వలన భోజనం దొరికిందిగానీ - దేవుడేం పంపలేదు. ఇప్పడైనా నా దారికి రాక తప్పదు నీవు" అన్నాడు. ఫక్కున నవ్వాడు బీర్బల్. "మహాప్రభూ, మీరు చక్రవర్తులు. మీరు మీ రాజ్యంలోని ఒక చిన్న రైతు గడపలో నిలబడి చెయ్యి చాపవలసి వచ్చింది. నేను కుదురుగ్గా నిశ్శబ్దంగా దైవాన్ని నమ్మి కూర్చుంటే - నా ప్రభువే నాకు భోజనం తెచ్చిపెట్టారు. చూచారా మానవ యత్నానికీ, దైవానుగ్రహానికీ తేడా!" అన్నాడు. తెల్లబోయాడు అక్బర్. అవును, నిజమే. బీర్బల్‌కు అతను నమ్మిన భగవంతుడే భోజనం పంపాడు - అదీ తన ద్వారా. చిరునవ్వు నవ్వుకున్నాడు. మరునాడు సభలో దైవానుగ్రహం మానుషయత్నం కన్నా చాలా గొప్పదని ఒప్పకున్నాడు అక్బరు.

❄

ఒకసారి ఒక భక్తుడు రామకృష్ణ పరమహంస సన్యాస శిష్యుడైనా బ్రహ్మానందస్వామిని "మహారాజ్, గురువు నిజంగా అవసరమా?" అని అడిగాడు. ఆయన "నిర్ద్వంద్వంగా అవసరమే. దొంగతనం చేసేవాడికి కూడా గురువు కావలసిందే. అలాంటప్పుడు అత్యంత సూక్ష్మమైన బ్రహ్మజ్ఞానం నేర్చుకోవడానికి గురువు అవసరం కాదా?" అన్నారు.

# పుణ్యపావనోపాఖ్యానము

## యోగవాసిష్ఠగాథ

వసిష్ఠ మహర్షి శ్రీరామునితో యీ విధంగా చెప్తున్నాడు. "రామచంద్రా, పూర్వం మహేంద్రపర్వతసానువులలో 'దీర్ఘతపసుడు' అనే మునీంద్రుడుండేవాడు. ఆయన కుమారులు ఇద్దరు. పుణ్యుడు, పావనుడు. పుణ్యుడు తన తండ్రినేగాక, మహాత్ములైన వారనేకులను సేవించి పూర్ణజ్ఞాని అయినాడు. పావనుడు కూడా అజ్ఞానికాడుగానీ అన్నగారంతటి జ్ఞాని కాలేదు. కొంతకాలానికి దీర్ఘతపసుడు బ్రహ్మపదాన్ని పొంది, శరీరాన్ని విడిచివేసాడు. జ్యేష్ఠపుత్రుడైన పుణ్యుడు తండ్రికి ఉత్తరక్రియలన్నీ శాస్త్రీయంగా ఆచరించి, కర్తవ్యం పూర్తి చేసుకున్నాడు. పావనునికి మాత్రం పితృవియోగం సహించరానిదైనది. అతని మనసు స్థిమితంగాలేక చాంచల్యంతో ఎట్లెట్లానో తిరగసాగాడు. అది చూచి జాలిపడిన పుణ్యుడు అతన్ని చేరదీసి ఇలా వివరించాడు.

"తమ్ముడా, నీవెందుకు ఏడుస్తున్నావు? సృష్టిలో అతి సహజమైన విషయాన్ని సహజంగా తీసుకోలేక ఎందుకు ఆవేదనకు లోనవుతున్నావు? మరణమన్నది ప్రకృతి. జననమే వికృతి. పైగా మన తండ్రిగారు మహాజ్ఞాని. ఆయన మోక్షపదాన్ని పొందారు. అందుకు మనమెంతో ఆనందించాలిగానీ ఏడవటం దేనికి? నీకు గతంలో అనేక జన్మలు కలిగాయి. ప్రతి జన్మలోనూ ప్రతి జీవికీ తల్లిదండ్రులుంటారు. ఆ లెక్కన నీకు ఇప్పటికే అనేకమంది తల్లిదండ్రులున్నారు. వాళ్లంతా చనిపోయారు. అలాగే నీ గత జన్మలలోని బంధుబలగమంతా కూడా గతించిపోయింది. తల్లిదండ్రుల కోసం ఏడవటం సహజమైనదేనని నీవంటే - ఒక్క యీ జన్మ తండ్రి కోసమే ఏమిటి - అందరి కోసమూ ఏడవాలి. ఎందరి కోసమని ఏడవగలవు?

పైగా నీ గత జన్మల బంధువులనేకులు ఇప్పడు మృగాలుగా, పక్షులుగా, క్రిమికీటకాలుగా ఎన్నెన్నో హీనజన్మలు పొందారు. వాళ్లందరికోసం కూడా ఏడుస్తావా? అసలు నీ గురించి నీకు తెలుసా? దశార్ణదేశంలో అడవి





ఏనుగుగా, తుషారంలో రాకుమారుడిగా, పుండ్రంలో కాకిగా, హైహయ రాజ్యంలో సామంతుడివిగా, త్రిగర్తంలో గాడిదగా, సాళ్వదేశంలో తేనెటీగగా, సరళ వృక్షంపైన పక్షిగా యింకా ఎన్నెన్నో యోనులలో ఎన్నో వేల మార్లు పుట్టావు ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవీ పోక తప్పదు. పండుటాకులు చెట్ల నుండి రాలినట్లుగా జీవులందరూ రాలిపోతూనే ఉంటారు. రేపు మనకూ తప్పదు మృత్యువు. అది తెలిసి కూడా మనమేదో శాశ్వతులమైనట్లు పోయిన వారి కోసం చింతించటం మూర్ఖత్వం.

అందుచేత, తమ్ముడా, నీవు జరామరణాలు లేనటువంటి ఆత్మను గురించే చింతనచెయ్యి. బ్రహ్మనిష్ఠను పొందినవాడు శోకానికీ, మోహానికీ లోనుకాడు. లే, లేచి కర్తవ్యోన్ముఖుడవవ్వు."

అన్నగారి బోధన విన్న పావనుడు జ్ఞానవంతుడై, శోకాన్ని విడిచిపెట్టాడు.

## Character

Character building
the task of life time -
demands the richest spiritual materials
faith, courage
humility, integrity,
magnanimity, nobility
self giving.
Wealth, influence, position, power -
these are of little value
without character.
Grandeur of character
is moral principle in practice.

***- Grenville kleiser***

# మనన యోగ్య శ్లోకాలు

శ్రీ మదాది శంకరాచార్యుల వారు గొప్ప అద్వైతి. కానీ మహా భక్తుడు. తనకూ, పరమాత్మకూ భేదం లేదనీ తాము ద్వయం - రెండు - వేరు వేరు కామనీ గ్రహించినవాడు అద్వైతి. భగవంతుడు సర్వశక్తిమంతుడుగా, తానాయనకు దాసుడనూ అనుకొనేవాడు భక్తుడు. మరి అద్వైతి భక్తుడెలా అయ్యాడు? అదే శంకరునిలోని వైశిష్ట్యం. సర్వే సర్వత్రా జగదాత్మను దర్శిస్తూ, దర్శిస్తూ తాను కూడా అందులోనే లయించిపోయాడన్నమాట ఆ పావనమూర్తి. ఆయన సాధకుడిగా రచించిన - అశువుగా పలికిన శ్లోకాలలో ఎన్నెన్నో ఆణిముత్యాలున్నాయి. ఆర్తి, ఆరాటం అణువణువునా నిండిన రెండు శ్లోకాలిప్పుడు చూద్దాం.

*'నజానామి దానం నచ ధ్యాన యోగం*
*నజానామి తంత్రం న చ స్తోత్రమంత్రం*
*న జానామి పూజాం న చ న్యాసయోగం*
*గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!"*

*- భవాన్యష్టకం.*

- దానం, ధ్యానం, యోగం, తంత్రం, మంత్రం, పూజాదికాలు ఏమీ ఎరుగని వాడను. తల్లీ, నాకున్న దిక్కు నీ వొక్కదానివే. నిన్నే శరణు వేడుకొన్నాను- నీవే రక్ష

అలా అంటూనే తానెంతకాలమున్నా యోగ్యత సంతరించుకోలేకపోతున్నాననీ, సిద్ధినందలేకపోతున్నాననీ, మనసును లయింపజేయలేకపోతున్నాననీ ఎంతో ఆవేదన చెందాడు. సాధకుడైనవాడు పరమాత్మను మనసారా విశ్వసిస్తూనే, ఆయనకు శరణాగతుడవుతూనే కేవలం కాళ్లు చాపుకొని కూర్చోకూడదు. తన సాధన తాను చేస్తూనే ఉండాలి, తన స్థాయి ఎంతవరకు వచ్చిందో అంచనా వేసుకొంటూనే ఉండాలి.





"కదా న హృషీకాణి సామ్యాం భజేయు:,
కదా వా న శత్రుర్నమిత్రం భవాని ।
కదావా దురాశా విషూచీ విలోప:,
కదా వా మనో మే సమూలం వినశ్యేత్ ॥

*- దేవీ భుజంగ ప్రయాత స్తోత్రం*

- నా ఇంద్రియాలెన్నడు అదుపులోకి వస్తాయి? నాకు వీరు శత్రువులు, వీరు మిత్రులు అనే భేదబుద్ధి ఎప్పుడు నశిస్తుంది? మితిమీరిన ఆశ అనే విషూచి వ్యాధి (కలరా) నన్నెప్పుడు వదిలిపెడుతుంది? నాకు మనస్సనేదే లేకుండా ఎప్పుడు నశించిపోతుంది? ఎలాంటి సంకల్ప వికల్పాలూ లేకుండా నేనెన్నడు (స్వామిలో) లయించగలను?

అంతటి ఆదిశంకరులవారే అంత అల్లాడిపోతే - మరి మనం ఏ విధంగా సాధనను కొనసాగించాలి? దానికై ఎంతగా తపించాలి? ఆలోచించుకుందాం. పై శ్లోకాలు రెండూ మననం చేసి నేర్చుకుందాం.

'రబియా' అనే సూఫీ సన్యాసిని ఒకరు మధ్య యుగంలో ఉండేవారు. ఆమె ప్రేమతత్వాన్ని గురించి చాలా గొప్ప సూక్తులు చెప్పారు. ఎల్లవేళలా దివ్య చైతన్యంలో ఉండే ఆమెను ఒకసారి ఒకరడిగారు - "నీవు భగవంతుడిని ప్రేమిస్తున్నావా?" అని. ఆమె అవునన్నది "మరి సైతానును నీ శత్రువుగా భావిస్తున్నావా?" అని అడిగారు వారు. ఆమె చిరునవ్వుతో, "లేదే! నా ప్రభువును ప్రేమించడానికే నాకెక్కడి సమయమూ చాలకపోతోంటే యిక సైతానును ద్వేషించడానికి సమయమేదీ!" అన్నారు.



# హనుమ హృదయం

-శ్రీ జి.వి.ఎస్. మూర్తి

సుందరకాండంతా హనుమ లంకా నగర దర్శనం, సీతాన్వేషణమే. సీతను దర్శించిన హనుమ దు:ఖంతో శోషిల్లి పడి ఉన్న ఆ తల్లిని మేల్కొల్పటం ఎంత మనోహరంగా ఉందో వినండి. "హనుమ హృదయం"లోనిదిది.

అమ్మా ప్రణామం! వద్దు ఇక శోకం
విజయమిక తథ్యం! మేలుకో తక్షణం

రాజర్షి సేద్యాన మోక్ష ప్రదాయినిగ
వెలసినా వైదేహి మేలుకో -

నాగేటి చాలులో నగవులే పూసిన
లోకైక పావనీ మేలుకో - దనుజుల
పాపాలు దహియించ మేలుకోవమ్మా!

పుడమి తల్లికి కొత్త పులకింత లివ్వగా
ఒడిలో విరిసిన చానా మేలుకో

శివ ధనువునలవోక, వేలితో కదిపిన
చిచ్ఛక్తి రూపిణీ మేలుకోవమ్మా -

ఆ విల్లునే విరచి, నిన్ను చేపట్టిన
అయ్య కనిపెట్టినదె మేలుకో, అయోధ్య
రాజ్యాల నేలగా మేలుకో -

శబరి ఎంగిలి పండ్లు భక్షించు మా రాజు
ప్రేమ తత్త్వము నెరిగి మేలుకోవమ్మా -

అడుగులో అడుగుగా మేలుకో, మా గుహుని
మరల దీవించగా మేలుకో -
ధర్మరక్షణ కొరకు నీ ధర్మ విభుండు






కోదండమును దాల్చె మేలుకోవమ్మా -

గాలించి, గాలించి, కడకు నీ కొరకు ఆ
కడలి కావల నిలిచె మేలుకో -

మాయలేడిని కొట్టి మరలి వచ్చిన విభుని
కడలి దాటించగా మేలుకో కన్నీటి
కడలి దాటించగా మేలుకో.

మూఢుడా రావణుని నేలకూల్చే రామ
బాణాల పదనునే చూడగా మేలుకోవమ్మా

శశిచంద్రికల జల్లు నయమింక చాలించి
భానుతేజమువై మేలుకో -

ఒక్కొక్క కిరణమొక ఇనవంశు బాణమై
లంక తిమిరము కాల్చ మేలుకోవమ్మా -

నిన్ను రక్షించగా, ప్రాణమొదిలిన పక్షి
ఆత్మ శాంతించగా మేలుకో, లోకాన
ధర్మమే గెలుపొంద మేలుకో -


గురుతుగా రామయ్య పంపిన ఉంగరము
కనులార గాంచగా మేలుకోవమ్మా -

బంగారు చేతులతో బంగారుటుంగరము
అందుకొనగా లెమ్ము బంగారు తల్లీ -


మాయకోతిని కాను, రామబాణము నేను
ఒక్కడిని కానమ్మ దేవసేనను నేను -

లంకపై వాలిన తోకచుక్కను నేను
రావణాంతానికి సంకేతమును నేను -

అమ్మా ప్రణామం, లేదు ఒక శోకం
మేలుకో తక్షణం, గెలుపు ఇక తథ్యం.



# ద్వాదశ జ్యోతిర్లింగాలు



పరమేశ్వరుని అష్టతనువులలో అగ్ని ఒకటి. ఆయన ప్రళయ కారకుడు గనుక రుద్రుడు. అందుచేతనే యావద్భారత దేశంలోనూ అనేకానేక జ్యోతిర్లింగ క్షేత్రాలు వెలిసాయి. అందులో పండ్రెండు (12) క్షేత్రాలు మహా శక్తిమంతాలు గాను, మహిమాన్వితాలుగాను ప్రసిద్ధి చెందాయి. రోజూ ఒకసారి వీనిని స్మరిస్తూ, శివమూర్తిని ధ్యానిస్తే ఎంతో మేలు కలుగుతుందని శివస్వాములు చెప్తారు. ఒకసారి నేర్చుకుందాం.

సౌరాష్ట్రే సోమనాథంచ, శ్రీశైలే మల్లికార్జున: ।
ఉజ్జయిన్యాం మహాకాళం, ఓంకారేత్వమలేశ్వరమ్ ॥
పరళ్యాం వైద్యనాథంచ డాకిన్యాం భీమశంకరమ్ ।
సేతుబంధనేతు రామేశం, నాగేశం దారుకావనే ॥
వారణాస్యాంతు విశ్వేశం, త్ర్యంబకం గౌతమీ తటే ।
హిమాలయేతు కేదారం ఘృష్ణేశం చ విశాలకే ॥

సాగర తీరాన రెండు, నదీతీరాలలో మూడు, కొండల మీద నాలుగు, మైదాన ప్రదేశాలలో మూడు - మొత్తం పన్నెండు జ్యోతిర్లింగాలు. సౌరాష్ట్రలో సోమనాథుడు, శ్రీశైలంలో మల్లికార్జునుడు, ఉజ్జయినిలో మహాకాళేశ్వరుడు, వింధ్య దగ్గర ఓంకారేశ్వరుడు, హిమగిరులపై కేదారేశ్వరుడు, డాకినిలో భీమశంకరుడు, కాశీలో విశ్వేశ్వరుడు, గౌతమీ తీరాన త్ర్యంబకేశ్వరుడు, పరిలి అనేచోట వైద్యనాథస్వామి, దారుకావనంలో నాగేశ్వరస్వామి, రామసేతు సమీపంలో రామేశ్వరుడు, ఘృష్ణేశ్వరంలో ఘృష్ణేశ్వరుడు - ఈ పన్నిద్దరు పరమేశ్వరులకూ అంజలి ఘటించి నమస్కరిద్దాం.





# ఆదిగురువు-దత్తప్రభువు



(గత సంచిక తరువాయి)

## సర్వం గురుమయం

పూర్వం యదువనే ఒక మహారాజు శ్రీ దత్తుని పట్ల ఎంతో భక్తిశ్రద్ధలు కలిగి ఉండేవాడు. ఒకసారి ఆయన దత్తస్వామిని ఇలా అడిగాడు- "స్వామీ, మీరు ఏమీ పట్టనట్లుంటారు - అందరినీ పట్టించుకుంటారు. అనంతసౌఖ్యాలు ప్రసాదిస్తారు - మీరు మాత్రం కడు నిరాడంబరంగా ఉంటారు. ధర్మం తప్పరాదని చెప్తారు - ఏ ధర్మమూ పాటించినట్లుండరు. అద్భుతమేధో సంపద మీకున్నది- అయినా కొన్నిసార్లు వెర్రివాడిలా ప్రవర్తిస్తారు. ఇదంతా నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. మీరు అనుసరిస్తున్న ధర్మం ఏమిటి? నాకు విపులంగా తెలుసుకోవాలని ఉన్నది స్వామీ!".

దత్తాత్రేయుడు కరుణార్ద్ర దృక్కులతో చూస్తూ యిలా చెప్పాడు. "యదురాజా! నీవు అడిగిన దానికి నేను చెప్పే విషయంతో నీ సందేహాలన్నీ తీరుతాయి. నాకు ప్రపంచం అంతా గురుమయమే. ఇరవై నలుగురు గురువులనుండీ నేనెన్నో విషయాలు నేర్చుకున్నాను. అవి ఆచరిస్తూ ఉంటాను. అవి కొన్నిసార్లు పరస్పర విరుద్ధంగా కన్పించవచ్చు. కానీ అవన్నీ ఒకే తత్త్వాన్ని బోధిస్తాయి. నీవు సాధకుడివి గనుక నీకోసం వాటిని వివరిస్తాను.

నా తొలి గురువు భూమి. ఇది సహనానికి మరోపేరు. తనపైన మల మూత్రాల వంటివి విసర్జించినా, పంటల కోసం త్రవ్వి హింసించినా, తన మీద ఎంతెంత భారాలు వేసినా ఆ తల్లి కోపించదు. భూమిపైగల నదులూ, పర్వతాలూ కూడా లోకక్షేమాన్నే కోరుతాయి. అనేక రకాల లోహాలు, వజ్రాదులు ఇస్తుంది భూమి. అలాగే పర్వతాదులు కూడా. కేవలం మనం పెట్టే ఇబ్బందులు భరించటమే కాక-ఎదురు పంటలు పండించి యిచ్చి మన బ్రతుకులు కాపాడుతుంది భూమి. సాధకుడు కూడా తననెవరెంతగా విసిగించినా, బాధించినా గానీ వారికి కీడు చెయ్యకూడదు. వీలైనంతవరకు వారికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించడానికే ప్రయత్నించాలి - ఇలా భూమి నాకు క్షమ నేర్పి గురువైంది.

నా రెండవ గురువు వాయువు. పరిమళా లెగబోసే పుష్పాదికాల మీదుగానూ, దుర్గంధభరితమైన మలినాల మీదగానూ కూడా ప్రసరిస్తుంది.

సుగంధ దుర్గంధాలను మోసుకొచ్చినట్లే కనిపిస్తుంది. కానీ కొద్దిక్షణాలలోనే వాటిని వదిలివేసి, తన స్వస్వరూపాన్ని పొందుతుంది. అలాగే సాధకుడు కూడా తన చుట్టూ ఉన్న వారితో కలసిమెలసి ఉండాలి. వారి కష్టసుఖాలు పట్టించుకొంటూనే ఉండాలి. కానీ, వేటినీ తన మనసుకు అంటించకోకుండా నిర్లిప్తంగా ఉండాలి. తనలోకి వచ్చే చిత్త చాంచల్యాలను పోనీ విక్షేపాలను వదిలెయ్యాలి అని నేర్చుకొన్నాను.

నా మూడవ గురువు ఆకాశం. ఆకాశం అంటే శూన్యం. దానికి రంగు, రూపం ఏవీ ఉండవు. దూరంనుంచీ చూచే వారికి మాత్రం తారలు, చంద్రుడు, సూర్యుడు, మేఘాలు ఆకాశంలో ఉన్నట్లుగుపిస్తాయి. నీలిరంగులో ఉన్నట్లనిపిస్తుంది. కానీ ఆకాశం తనలో ఏ వస్తువునూ ఉంచుకోదు. ఏ వన్నెనూ పులుముకోదు. అలాగే సాధకుడు కూడా ఎందరెందరో తన సాంగత్యంలో ఉన్నట్లు లోకులకు కన్పిస్తున్నా - తాను మాత్రం నిత్యం నిస్సంగుడై ఉండాలి. తనలో అందరి విషయాలు ప్రవేశిస్తున్నట్లు కన్పిస్తున్నా తన లోపలికి ఏదీ తీసుకోకూడదనీ మనసు శూన్యంగానే ఉంచుకోవాలనీ నేర్చుకొన్నాను.

నాల్గవ గురువు నీరు. నీరు సహజంగా సుకుమారంగా (స్నిగ్ధంగా) చల్లగా మధురంగా ఉంటుంది. అలాగే సాధకుడు సహజ కోమల స్వభావంతో, మధుర వర్తనుడై ఉండాలి. నీరు నిర్మలమైనది. తాను ఏ పాత్రలో ఉంటే ఆ ఆకృతినే ధరిస్తుంది తప్ప సొంతానికి ఏ ఆకారమూ ఉండదు. మనుష్యుల దోషాలను తొలగించగల శక్తి జలానికి ఉన్నది. అలాగే సాధకుడు పరుల దోషాలను సరిచేసి వారికి సరియైన పవిత్రతనిచ్చే ప్రయత్నం చేయాలని నేను తెలుసుకొన్నాను.

నా ఐదవ గురువైన అగ్ని మహాప్రకాశమానుడై, తాను తాకిన దానికల్లా పవిత్రతను కలిగిస్తాడు. ఆహారాన్ని పచనం చేసి రుచ్యంగా చేస్తాడు. అలాగే సాధకుడు తన తేజస్సుతో ఇతరులకు పవిత్ర సంస్కారాలు కలిగించాలి. అతని లోని ఆధ్యాత్మిక భావాలను శుభ్రంగా పచనం చేసి జీర్ణం చేసుకోవడానికి వీలుగా చేయాలి. అగ్ని ఒకప్పుడు స్పష్టంగా, ఒకప్పుడు సూక్ష్మంగా తాను ఆశ్రయించిన కాష్ఠాన్నిబట్టి వెలుగుతాడు. మంచి వాటినీ, చెడ్డవాటినీ అన్నిటినీ దహిస్తూ ఆహారంగా గ్రహిస్తాడు. తాను మాత్రం అపవిత్రుడు కాడు. అలాగే యోగి తనకు భిక్షగా ఎవరేమిచ్చినా తినవచ్చుగానీ - యిచ్చిన వారితో సంగం మాత్రం పెట్టుకోరాదని తెలుసుకున్నాను.





ఆరవ గురువు చంద్రుడి నుండీ నేను సాధకుడు ఆయనలాగే శీతల హృదయుడిగా ఉండాలని తెలుసుకున్నాను. వృద్ధి క్షయాలు-శుక్లపక్షం పదిహేను రోజులు క్రమాభివృద్ధీ, బహుళ పక్షంలో క్రమక్షయం అన్నవి చంద్రునికి ఉన్నప్పటికీ అవి ఆయన కళలకేగానీ ఆయనకు కావు. అలాగే ఆయనలో కలిగే కామక్రోధాదులు, భావవికారాలు మన తనువుకే గానీ ఆత్మకు కారాదని నేర్చుకొన్నాను.

నా ఏడవ గురువు కర్మసాక్షి అయిన సూర్యభగవానుడు. ఆయన భూమి మీది నీటిని గ్రహించి, తిరిగి భూమికే వర్షరూపంలో అదునెరిగి అందిస్తాడు. అలాగే సాధకుడు విషయాల ద్వారా (ఇంద్రియాల ద్వారా) గ్రహించిన వాటిని తిరిగి వదిలివెయ్యాలిగానీ-తన లోపలే స్థిరంగా ఉంచుకోకూడదని తెలిసికొన్నాను. ఒకే సూర్యుడు అనేక జలపాత్రలలో అనేకమంది సూర్యులలాగే కనిపించినట్లే ఒకే ఆత్మ అన్ని ఉపాధులలో యిన్ని రకాలుగా కన్పిస్తుందని తెలిసికొన్నాను.

నా తదుపరి గురువు కపోతం. ఈ ఎనిమిదవ గురువు ఒక వృక్షం పైన భార్యాబిడ్డలతో నివసించేది. ఒకరోజు రెక్కలు సరిగారాని తమ బిడ్డల కోసం ఆహారం తేవాలని ఆలుమగలు ఎటో వెళ్లాయి. ఈ లోపల ఒక బోయవాడు చెట్టు క్రింద వలపన్ని నూకలు చల్లాడు. అనేక పక్షులు వచ్చి ఆ వలలో చిక్కుకొన్నాయి. వాటి కోలాహలం విని లేలేత పక్షిపిల్లలు వచ్చీరాని రెక్కలతో దిగివచ్చి తాము కూడా ఆ వలలో చిక్కుకున్నాయి. ఆహారం తీసుకొని బిడ్డలు ఆకలితో ఉంటారని ఆత్రంగా వచ్చిన తల్లి పక్షి - తన పిల్లలు వలలో ఉండటం చూచి, దు:ఖంతో ఒళ్లు తెలియక గభాల్న వెళ్లి బిడ్డలను కౌగిలించుకొన్నది. కొంతసేపటికి మగపక్షి కూడా వచ్చింది. తన భార్యాబిడ్డల దురవస్థ చూచి పట్టరాని దు:ఖానికి లోనైంది. తన వారందరూ పోయాక - తానుండి మాత్రం ప్రయోజనం ఏమిటని ఏడ్చి ఏడ్చి, తాను కూడా వలలోకి దూకి బోయ చేతికి చిక్కి మరణించింది. ఇది చూచి నేనెంతో నేర్చుకొన్నాను. జీవులు బంధాలు కోరి తెచ్చుకుంటారు. అవే వారికి దు:ఖహేతువులవుతాయి. అఖండ జ్ఞాన నిలయమైన మానవజన్మ సంప్రాప్తించిన తరువాత కూడా - వివేకాన్ని పోగొట్టుకొని మోహం చెందుతున్నారే - దీనికి తరుణోపాయం ఒక్కటే. ఎవరితో గానీ అతి స్నేహం, ఎక్కువ సంభాషణ ఉంచుకోకూడదు. కర్తవ్యార్థమై ఎంత, ఎవరితో సంబంధం ఉంచుకోవాలో అలా ఉండేవాడే సరైన సాధకుడవుతాడు.

**(సశేషం)**

# ఇది నా ఆత్మకథ

– కామం

(శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీకాంతానంద వారి రచనకు అనువాదం)

నా పేరు కామం. మహామహా వీరులను కూడా పడగొట్టగల శక్తి నాకున్నది. నేను మనుష్యుల మెదళ్లలోనే అతి సన్నిహితంగా ఉంటాను. అయినా వాళ్లు నన్ను కనుక్కోలేరు. ఎంతటి పండితులూ, జ్ఞానులూ కూడా నా ఆవిర్భావాన్ని కనుక్కోలేరు. కొన్నిసార్లు నేను మనిషిని తిన్నగా - అంటే బహిరంగంగానే ఆక్రమించే ప్రయత్నం చేస్తాను. ఒకవేళ వాడు నన్ను పట్టి బంధించబోతాడని తోస్తే - ఎవ్వరూ ఊహించలేని సరికొత్త విభిన్నమార్గంలో మీదపడతాను. వాళ్ల అశ్రద్ధనూ, బలహీనతలనూ గమనిస్తాను. కరుణ, సానుభూతి, ప్రేమ - యిలా ఎన్నో అవతారాలెత్తుతాను. తరువాత మెల్లగా నా అసలు రూపం చూపిస్తాను. కొందరు వివేకవంతులు నన్ను ఆ రూపాలలో కూడా గ్రహించి బంధించేస్తారు. వాళ్లు నన్ను జయించామనుకొని మితిమీరిన ఆత్మవిశ్వాసంతో అలక్ష్యంగా ప్రవర్తిస్తారు. సరిగ్గా అదే క్షణంలో తిరిగి వారిని ఆవరిస్తాను. నాకు కరుణ లేదు. నా పాలపడినవారు ఏమైపోయినా నాకు లెక్కలేదు. అది నా పని కాదు. వీలైనంత ఎక్కువ మందిని దిగమ్రింగేసి సజీవంగా సర్వనాశనం చెయ్యటమే నా పని. నేను దయ్యాల జాతికి చెందినదాన్ని, మా రాక్షస జాతిలో బాంధవ్యాలను లెక్కచెయ్యం. నేను మనిషి మెదడులో ప్రవేశించిన మరుక్షణమే నేను చేసే మొదటిపని అతడిని రాక్షసుడిగా మార్చటం. వాడు వావివరుసలు మరచి, హీనకృత్యాలు చేసేలా చేస్తాను. ఒక కాముకుడైన తండ్రి తన కుమార్తెతో ఉండవలసిన బాంధవ్యాన్ని గుర్తుంచుకోడు. వాడు నా శక్తికి లొంగిపోతే అంతే. మనుష్యుల మనసుల్లో అనుమానాలను, సంశయాలను కలిగించేది నేనే. అలా కుటుంబాలను విఛ్ఛిన్నం చేస్తాను. నా పూర్వులు నా అంత - అంటే కలియుగంలో నేన్నునంత బలవంతులు కారు. కారణం - ఆ రోజుల్లో మనుషులు భగవంతుడిని విశ్వసించేవారు. కానీ, కలియుగంలో ప్రజలకు దైవశక్తిపై విశ్వాసం లేదు గనుక నా పని తేలికైపోయింది.





మనుష్యులు దివ్యశక్తి రక్షణలో ఉంటే నేను నిస్సహాయురాలినై వారిని సమీపించనే లేను. వారి దైవ నామోచ్చారణ అనే ఆయుధం నన్ను బలహీనుడిని చేసి నా శక్తి లాగేస్తుంది. రావణాసురుడు మా జాతి (రాక్షస)వాడే. కానీ చాలా పొగరుబోతు, అందరినీ తొక్కిపెట్టేస్తాడు. అందుచేత అతనికొక పాఠం నేర్పాలనుకొన్నాను. సీతమ్మను చెరబట్టేలా ప్రేరేపించి వాడిని నాశనం చేసాను. ఎంతో తపస్సంపన్నుడైన విశ్వామిత్రుడిని పట్టుకొన్నాను. అంతే - మేనక సౌందర్యం ముందు ఆయన బోర్ల పడిపోయాడు. కానీ, అతని సంకల్పశక్తి చాలా గొప్పది. అందుచేతనే త్వరగా తేరుకొని బ్రహ్మర్షి పదాన్ని పొందాడు. నేను తలవంచుకోవలసి వచ్చింది. కానీ అందరూ విశ్వామిత్రులు కాలేరుగా! గొప్ప గొప్ప మహారాజులు సైతం నా ప్రభావానికి లోనై రాజ్యచ్యుతులై నశించి పోయారు. వాళ్ల అహానికి, కోరికలకు వారు లొంగిపోయి, బలహీనులై శత్రువులకు చేజిక్కిపోయారు. వీళ్లేమిటి-దేవతలనే లొంగదీసాను నేను. గౌతమర్షి భార్య అహల్యను నాశనం చేసిన ఇంద్రుడు నా వలననే అలా అయ్యాడు. స్వయంగా శ్రీరామచంద్రునంతటివానినే శూర్పణఖ రూపంలో బంధించాలని ప్రయత్నించాను. రామచంద్ర ప్రభువు నన్ను గమనించగలిగాడు. ఆయన ముందు ఓడిపోయాను. కానీ, పాపం శూర్పణఖ నా కొంటెతనానికి బలైపోయింది. పరమేశ్వరుడు తీవ్రధ్యానంలో ఉన్నపుడు ఆయన మీదికి వెళ్లానొకసారి. కానీ ఆయన తన (జ్ఞాననేత్రపు) చిచ్చఱ కంటి మంటలతో నన్ను భస్మం చేసాడు. నాకు ఆయనను చూస్తే చచ్చే భయం.

సాధారణంగా నేను నా స్వజాతీయులను (రాక్షసులను) నాశనం చెయ్యను. కానీ, శ్రీమన్నారాయణుని ఆజ్ఞతో భస్మాసురుని స్వామి మోహినీ రూపం సాయంతో నాశనం చేయవలసి వచ్చింది. వాడిని గ్రుడ్డివాడిని చేసి వాడి చావు వాడే తెచ్చుకొనేలా చేసాను. అందుకే ప్రేమ గ్రుడ్డిదంటారు. (ప్రేమ కాదు - కామం గ్రుడ్డిది.) నేను పట్టుకొన్న వాడి కళ్లకు వికృతమైన ముఖమైనా ఎంతో మోహనంగా కన్పిస్తుంది. నేను ఎక్కడికి వెళ్లినా నా మిత్రులు నాకు తోడుగా వచ్చి సాయపడుతుంటారు. నా శక్తి పెంచుతుంటారు. నేను నిప్పనైతే వాళ్లు నెయ్యీ వెన్నా అవుతుంటారు. వాళ్ల పేర్లు క్రోధం, అసూయ, ఆశ, ద్వేషం,

భయం, వ్యామోహం, అహం యింకా యింకా. మా మాయకు లొంగిన మనుష్యులు నేరస్థులుగా మారతారు.

సమస్త విశ్వం నా గుప్పిట్లో ఉంది. ఇది దైవం సృష్టించినదనీ, ఆయనే పరమ ప్రభువనీ మరిచిపోయి, నేను ఈ లోకానికి పరిపాలకుడిననీ అహంకరిస్తాను. నా అహం పెరిగిపోయినపుడు స్వయంగా భగవంతుడే భూమిపై అవతరించి, నన్ను విధ్వంసం చేస్తాడు. ప్రభువు తానుగానీ నేను కానని నాకు తెలియజేస్తాడు. ఒక్క ఆ పరమప్రభువుకే నేను భయపడతాను. మనుష్యులు ఎంతకాలం ఆయన బోధలు విని ఆచరిస్తూ ఆయన పాదపద్మాలపై భక్తి నిలుపుకొంటూ జీవిస్తారో - అంతకాలం నేను వాళ్లకు దూరంగానే ఆగిపోతాను. మళ్లీ ఎప్పుడో వాళ్లు ఆయన్ను మర్చిపోతారు. ఆయన శక్తినీ, మహిమనూ, చివరికి ఆయన ఉనికినే శంకిస్తారు. అదుగో అప్పుడు మళ్లీ నేను విజృంభిస్తాను. నా విశ్వరూపం చూపిస్తాను. అందుకే పదేపదే చెప్పారు శ్రీ రామకృష్ణ పరమహంస - "నాయనా! కామానికీ, ఆశకూ లొంగకండి, జాగ్రత్తగా ఉండండి" అని. ॐ

## ఓ చిన్న-కానీ-పెద్దముచ్చట

**(30వ పేజీ తరువాయి)**

చిన్న చిన్న పిల్లలు తాము పోగు చేసికొన్న పాకెట్‌మనీలోనుంచీ ఐదు వందల రూపా యలు తెచ్చి మామ్మగారికిచ్చి, "సాయిధామంలోని 'ఉష'లో చదువుకొంటున్న చెల్లెళ్లకూ, తమ్ముళ్లకూ పంపండి" అని చెప్పారట. ఆ విషయాన్ని ఎం.ఓ. ఫారం వెనుక వ్రాస్తూ మామ్మగారు "అమ్మా, వాళ్ల మాటలు వింటుంటే నాకు కన్నీళ్లు వచ్చాయి" అన్నారు అక్షరాలతో. ఆ చిన్నారి చిట్టిగాళ్ల పేర్లు చి॥ వి.శశిధర్ (6వ తరగతి), చి॥ జి. నవీన్ (6వ తరగతి), వి.కుమార్‌రాజా(4వ తరగతి). వీళ్లంతా వేంకటాద్రి హిల్స్ వాస్తవ్యులు. వీరిలో పడిన యీ సేవాబీజాన్ని శ్రీ సాయినాథుల వారు తమ కరుణాదృష్టితో తడిపి, తల్లిదండ్రులు ప్రోత్సాహమనే ఎరువు వేసి, గురుదేవుల ఆశీస్సు కంచె వేయగా - మహావృక్షాలుగా ఎదిగి ఎందరెందరు నిస్సహాయులకు నీడనివ్వాలని మా ప్రేమపూర్వకమైన ఆశీస్సులు. ✡





# ఓ చిన్న-కానీ-పెద్దముచ్చట

మాతాజీ

ఆంజనేయస్వామి సీతాన్వేషణకై బయలుదేరాడు. జటాయు సోదరుడు సంపాతి ఇచ్చిన ఆచూకీతో సీతమ్మ లంకా నగరంలో ఉండవచ్చునని గ్రహించారు వానరులంతా. లంకను లంఘించి వెళ్లగలవాడు హనుమంతుడే నని నిర్ణయించి ప్రోత్సహించారు. ఆయన స్వశక్తి నిగ్రహించుకొని, ఒక్క ఉదుటున లేచి, కొండపై నిలిచి, కాళ్లు నేలకు తాటించి, శక్తి అంతా ప్రోగు చేసుకొని హుమ్మని గాలిలోకి ఎగిరారు. ఆ ఎగరటంలోని మహావేగానికి పర్వతాగ్రాలపైనున్న మహావృక్షాలన్నీ కూడా వేళ్లతో సహా పెల్లగిలి హనుమతోపాటే కొన్ని యోజనాల దూరం ప్రయాణం చేసి, అప్పుడు సముద్రంలో పడిపోయా యంటాడు వాల్మీకి మహర్షి.

ఎవరైనా ఒకరు మనస్ఫూర్తిగా ఒక సత్కార్యంలో తీవ్రగతితో, నిష్కామంగా పనిచేస్తూ ఉంటే - ఆ ప్రభావం పరిసరాల మీద తప్పక ప్రతిఫలిస్తుంది. మన సద్యోజనే వారికి కూడా సద్బుద్ధిని కలిగిస్తుంది. లేదా-వారిలో నిద్రాణమై ఉన్న వివేచనను లేపి, కార్యాచరణకు పూనుకొనేలాగా చేస్తుంది. అయితే యిది ఎంత స్థాయిలో జరుగుతుందనేది ప్రారంభించిన వారి సత్తా మీద ఆధారపడి ఉంటుంది. రైలు వేగంగా పరుగిడుతున్నపుడు రైలు పట్టాల ప్రక్కనున్న కాగితాలన్నీ వేగంగా పైకి లేచి గాలిలో ఎగురుతుంటాయి. అలాగే కార్యకర్తల వెంట అనుచరులున్నూ.

పరమపూజ్య గురుదేవులు ఒకానొక మహత్తర సంకల్పంతో సాయిధామం స్థాపించారు. వారి సంకల్పశుద్ధికి తోడుగా వారి శిష్యులు (గురూపదేశం ప్రకారం) చిత్తశుద్ధితో పనిచేయటం చేత అనేకానేకమంది తమంత తాముగా ముందుకువచ్చి యిక్కడి సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్నారు గత ఇరవై ఏళ్లుగా. కానీ, ఈ వేళ వచ్చిన ఒక మనియార్డరు ఎంతో ఆనందాన్ని కలిగించింది. మా సాయి మామ్మగారి ద్వారా ఆశ్రమం గురించి విన్న కొందరు

**(మిగతా 29వ పేజీలో)**

# మాతృసంస్థ కబుర్లు

సెప్టెంబరు 11వ తేదీ వినాయక చవితి వ్రతాన్ని సాయిధామంలోని ఆబాల గోపాలం కలిసి నిర్వహించారు. సాయిహర్ష మూలవిరాట్టును తయారు చేయగా-దానికి దీటైన విగ్రహం చేసాడు సాయిచంద్ర. మిగిలిన పిల్లలందరూ కూడా (సుధీరతో సహా) ఎవరి విగ్రహం వాళ్లు బంకమట్టి, కళ్లకు గురవింద గింజలు, రకరకాల రంగు కాగితాలు, తళుకులు, పూసలు ఉపయోగించి తయారుచేసుకొని అలంకరించుకొన్నారు. నందు వినాయకుడు రథం ఎక్కాడు. మరొకడి గణపతి మూషికం ఎక్కి కూర్చోగా-మరొకరి గణపయ్య సింహాసనం ఎక్కాడు. ఒకడు బంగారు రంగు కాగితంతో కిరీటం పెడితే మరొకడు అగ్గిపుల్లలకు తళుకు కాగితం కట్టి కిరీటం చేసారు. అలా వైవిధ్యంతో రూపొందిన (ఆరు అంగుళాల నుంచీ 2 అడుగుల వరకు) విఘ్ననాయకులకు శాస్త్రోక్తంగా పూజ జరిగింది. తోరాలు కట్టుకొన్న చేతులతో భక్తులందరికీ ప్రసాదాలు అందించారు. పనుల ఒత్తిడి ఎక్కువగా ఉండటంచేత మూడవనాడు బడిపిల్లలంతా కలిసి నిమజ్జనోత్సవం నిర్వహించారు.

26 సెప్టెంబరు ఉండ్రాళ్ల తదియ (తద్దె). ఆ రోజు వేకువనే ఆడపిల్లలంతా తెల్లవారుజామునే లేచి స్నానాదికాలు చేసుకున్నారు. అటుపైన అంతా కలిసి వంట చేసుకున్నారు. పొట్లకాయ కూర, గోంగూర పచ్చడి, పెరుగులతో వేడివేడి అన్నం తెల్లారక ముందే తిన్నారు. గోరింటాకు (రాత్రే పెట్టుకొన్నారు) పండిన వేళ్లతో పెరుగన్నం కలుపుకొని తినటం-అదో సుందరదృశ్యం. ఉయ్యాలలూగటం, ఆటలాడటం, సాయంత్రం ఆలయాలలో సామూహికంగా గౌరీ పూజ చేసి, ఉండ్రాళ్లు నివేదన పెట్టటంతో ఆ పర్వదినం ముగిసింది. 23 సెప్టెంబరు పూర్ణిమ. కనుక శ్రీ సాయినాథవ్రతం జరిగింది. గడిచిన గురుపూర్ణిమ నుండి ప్రారంభించి 40 శనివారాలు సాయిఆంజనేయునికి ఆకుపూజ చేయాలని నిశ్చయించుకోవటం -అలాగే ప్రతి శనివారం చేయటం జరుగుతోంది. అభిరుచి ఉన్నవారెవరైనా తాము కూడా పాల్గొనదలుచుకొంటే పాల్గొనవచ్చు.





# కర్తవ్యం-ఫలితం

– “ఎక్కడిదో!”

అనగనగా ఓ తల్లి. ఏదో పని మీద బయటకు వెడుతోంది. అప్పడే ఆడుకొని వచ్చిన కొడుకును చూచి “నాన్నా, నేనొక్క గంటలో బయటకు వచ్చేస్తాను. నీవు కాళ్లూ, చేతులూ కడుక్కొని, హోం వర్కు చేసుకొని, అప్పడు పళ్లు తిను. వర్క్ ఎగ్గొట్టకూడదు - సరేనా!” అన్నది. సరేనన్నాడు పిల్లవాడు. వాడు కాళ్లూ ముఖం కడుక్కొని ఫ్రిజ్ తీసి చూచాడు. కూరగాయల అలమరలో, బుట్టల్లో, హోల్లో - అన్నిచోట్లా వెదికాడు. పండ్లే లేవు. “అమ్మ నా చేత ఎలాగైనా హోం వర్క్ చేయించడానికి పళ్లు దాచానని చెప్పింది. అన్నీ అబద్ధాలే! ఛీ!” అనుకున్నాడు. కోపంగా సోఫాలో ముడుచుకు పడుకొన్నాడు.

అమ్మ ఓ గంట తరువాత వచ్చింది. “ఏరా, బాబూ! హోంవర్క్ చేసావా?” అని అడిగింది. “ఆ! చేస్తాను పాపం! పళ్లు అట్టి పెట్టానని అబద్ధం చెప్పావు నాకు. ఎక్కడా లేనేలేవు” అన్నాడు అబ్బాయి కోపంగా. అమ్మ ఫక్కున నవ్వింది. “ఓరి పిచ్చివాడా, నీ స్కూలు సంచిలోనే పెట్టానురా రెండు యాపిల్‌పళ్లు. హోం వర్క్ చెయ్యడానికి సంచి తీసి ఉంటే కనిపించి ఉండేవి. ఏం చేస్తాం మరి! నీకు పళ్లు వెతకటంతోనే సరిపోయె!” అన్నది.

మనమూ యింతే. కర్తవ్యపాలన ప్రారంభించకుండానో, పోనీ ప్రారంభిస్తూనేనో ఫలితం గురించి ఆరాటపడుతుంటాం. నిజాయితీతో, విశ్వాసంతో పనిచేస్తూ పోతే ఫలితం అదే కనబడుతుందిగా!

## సాయివాణి పాఠకులకు ....

మిత్రులారా, మీమీ ఫోను నంబర్లతో, మీ చిరునామాతో, మీ చందా నంబరు చేర్చి మాకో కార్డు వ్రాయండి. మీరు కేవలం చందాదార్లుగా మాత్రమే కాక సాయిధామం అభిమానులుగా, కార్యకర్తలుగా మారాలని మా ఆకాంక్ష, అందుకు వీలుగా మీ ఫోను నంబర్లు, చిరునామాలతో కలిపి కార్డు పంపండి.